
సాక్షి విశాఖపట్నం

శనివారం । 5 । ఏప్రిల్ । 2025

అదిరేటాటూ




మారుతున్న కాలంతో పాటు పచ్చబొట్టు ఆధునిక పోకడలను సంతరించుకుని టాటూగా రూపాంతరం చెందింది. కాలేజీ కుర్రకారు మొదలుకొని సెలబ్రిటీల వరకు ఈ టాటూలకు దేశ విదేశాల్లో ఆదరణ పెరుగుతూనే ఉంది. ప్రేమ, స్నేహం, ఆవేశం, అభిమానం, ఫ్యాషన్.. ఇలా అన్నింటికీ టాటూ ఓ భావ వ్యక్తీకరణ మార్గంగా మారింది. ఇదిగో.. ఇలాగే. టైగర్ ట్రయాంఫ్ విన్యాసాల కోసం విశాఖకు వచ్చిన అమెరికన్లు.. తమ శరీర భాగాలపై ఇలా భిన్నమైన, భారీ భారీ టాటూలతో కనిపిస్తూ.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కాకి..హ్యాపీ




ఎండకు మనుషులే కాదు పక్షులు కూడా విలవిలలాడుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం కోసం విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద రోడ్డు మీద నీటిలో కాకుల గుంపు జలకాలాటలాడాయి. మండుతున్న ఎండకు నీరు తాగుతూ ఉపశమనం పొందాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ప్రారంభం



స్లాట్ బుకింగ్ ప్రతులను అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర

మహారాణిపేట: రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం శుక్రవారం విశాఖలో ప్రారంభమైంది. టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో ఉన్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బి.బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ టి. ఉపేంద్ర ప్రారంభించారు. తొలి దశలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభమైందని డీఐజీ బాలకృష్ణ తెలిపారు. మిగిలిన కార్యాలయాల్లో దశలవారీగా ఈ కార్యక్రమం అమలు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు డి.వి. నాయుడు, కనకరత్నం పాల్గొన్నారు.

8 నుంచి అంతర విభాగాల స్పోర్ట్స్ మీట్



పోస్టర్ విడుదల చేస్తున్న డీఆర్ఎం

విశాఖ స్పోర్ట్స్: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో అంతర విభాగాల స్పోర్ట్స్ మీట్ ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. అరకు, దమన్‌జోడి, కోరాపుట్, కిరండూల్, బచేలి, రాయఘడ, పలాస, శ్రీకాకుళం ప్రాంతాలలోని వివిధ విభాగాలకు చెందిన 19 జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. పురుషుల కోసం ఫుట్‌బాల్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, టేబుల్‌టెన్నిస్, బాడీబిల్డింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్, క్రికెట్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. మహిళలకు టేబుల్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్, అథ్లెటిక్స్ మొదలైన అంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) మనోజ్‌కుమార్, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ప్రవీణ్ బాతి, సంయుక్త క్రీడాధికారులు అవినాష్, నరేంద్ర కురి ఆవిష్కరించారు.

డైట్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమునిపట్నం: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) వద్ద డిప్యుటేషన్ పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. జ్యోతి కుమారి శుక్రవారం తెలిపారు. సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకుల పోస్టుల నియామకం చేపట్టనున్నామని, ఉమ్మడి జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) ఈ పోస్టులకు అర్హులని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 10వ తేదీలోపు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు.

స్టాఫ్ నర్స్ రిక్రూట్‌మెంట్‌లో నకిలీ సర్టిఫికెట్లు వాస్తవమే

ఆర్డీ రాధారాణి

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియలో నకిలీ సర్టిఫికెట్లు ఉన్నట్లు తేలింది. ఈ నెల 1వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'నర్సుల పోస్టులకు నకిలీ పత్రాలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నియామక ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలలో నకిలీ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఉన్నట్లు సాక్షి కథనంలో పేర్కొంది. దీనిపై ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఆర్డీ) డాక్టర్ రాధారాణి విచారణ చేపట్టారు. కరోనా సమయంలో పనిచేసినట్లు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల గురించి ఆర్డీ డాక్టర్ రాధారాణి సంబంధిత వ్యక్తులకు లేఖలు రాశారు. ముఖ్యంగా కేజీహెచ్ (కింగ్ జార్జ్ హాస్పిటల్) నుంచి అత్యధిక సంఖ్యలో ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు రావడంతో, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్‌కు ఆర్డీ డాక్టర్ రాధారాణి లేఖ రాశారు. ఈ సర్టిఫికెట్లు నకిలీవని కేజీహెచ్ నుంచి సమాధానం రావడంతో, ఆ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోలేదని ఆర్డీ డాక్టర్ రాధారాణి తెలిపారు. మొత్తం నకిలీ సర్టిఫికెట్లను పక్కన పెట్టామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆర్డీ వివరించారు.

● కరెంట్ ఇష్యూ

కోర్టు ఆదేశించినా సర్కారు కినుక



ఏపీఈపీడీసీఎల్‌లో 1,354 మంది జూనియర్ లైన్‌మెన్ పదోన్నతుల్లో విచిత్రం

- 18 ఏళ్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంపై అభ్యంతరాలు
- ఫలితంగా సీనియర్లు సైతం జూనియర్లుగా మిగిలిపోయిన పరిస్థితి
- హైకోర్టు ఆదేశించినా అమలుచెయ్యని డిస్కంలు
- కోర్టు కేసుల కారణంగా క్రమబద్ధీకరించలేకపోయిన గత ప్రభుత్వం
- సీనియార్టీ ప్రకారం జాబితా సిద్ధంచేయాలని 10 నెలల క్రితం హైకోర్టు ఆదేశాలు
- అయినా పాత జాబితానే కొనసాగిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : ఏ సంస్థలోనైనా చేసిన సర్వీస్ ప్రకారం సీనియారిటీని పరిగణిస్తుంటారు. కానీ.. విద్యుత్ పంపిణీ సంస్థల్లో మాత్రం విచిత్రంగా పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకున్నారు. ఉద్యోగి వయసు 40 సంవత్సరాలై సర్వీసు 15 ఏళ్లున్నప్పటికీ.. యాభై ఏళ్ల ఉద్యోగికి ఐదేళ్ల సర్వీసు ఉంటే.. సదరు ఉద్యోగినే సీనియర్‌గా పరిగణించారు. ఇలా 2008లో డిస్కం అధికారులు అడ్డగోలుగా పదోన్నతుల జాబితా తయారుచేశారు. దీనిపై కొందరు అప్పట్లోనే హైకోర్టుని ఆశ్రయించారు. సర్వీసు ప్రకారం పదోన్నతుల జాబితా సిద్ధంచెయ్యాలంటూ 2024 జూన్‌లో న్యాయస్థానం ఆదేశించినా.. టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీనిపై సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నిజానికి 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చే ముందు కరెంట్ పోతే ఫ్యూజులు బిగించేందుకు రైతులే వెళ్లి మృత్యువాత పడేవారు. దీంతో డిస్కంలలో లైన్‌మెన్ల కొరత వేధిస్తోందని తెలుసుకున్న వైఎస్సార్.. ఉమ్మడి రాష్ట్రంలో వెంటనే 7,114 పోస్టుల్ని భర్తీచేశారు. ఈ సమయంలో ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు ఉమ్మడి సర్కిల్స్ పరిధిలో 1,220 పోస్టులు భర్తీ అయ్యాయి.

సీనియారిటీ లిస్టుల్లో అధికారుల నిర్లక్ష్యం..

2008లో కొత్తగా రిక్రూట్ చేసిన లైన్‌మెన్ల గత అనుభవాన్ని అనుసరించి.. సీనియారిటీ లిస్టులు తయారుచెయ్యాలని అప్పటి ప్రభుత్వం డిస్కంలని ఆదేశించింది. అయితే.. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జాబితా సిద్ధంచేశారు. పనిచేసిన అనుభవం బట్టి కాకుండా.. వయసు బట్టి జాబితా తయారుచేశారు. దీనిపై అప్పట్లోనే అధికారులపై నాటి సీఎం వైఎస్ మండిపడ్డారు. ఆ తర్వాత ఆయన మృతిచెందడం.. తర్వాత ప్రభుత్వాలు విస్మరించడంతో నేటికి కూడా సీనియర్లు జూనియర్లుగానే మిగిలిపోయారు. జూనియర్లు మాత్రం ప్రమోషన్లు తీసుకుని సీనియర్లుగా చలామణి అవుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు బాధిత లైన్‌మెన్‌లు హైకోర్టుని ఆశ్రయించారు.



ఈపీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ ప్రతినిధులు (ఫైల్)

గత ప్రభుత్వ హయాంలో ప్రయత్నించినా..

సీనియారిటీ జాబితా విషయంలో అన్యాయం జరిగిందంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి బాధిత లైన్‌మెన్‌లు తీసుకెళ్లారు. అయితే.. అప్పటికే కోర్టులో కేసు నడుస్తుండటంతో ఫలితం దక్కలేదు. చివరి నిమిషం వరకూ సీనియారిటీ జాబితాలో మార్పులు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో.. గతేడాది జూన్ 21న హైకోర్టు తీర్పు వెలువరించింది. పనిదినాల ఆధారంగా మాత్రమే కొత్తగా సీనియారిటీ జాబితా తయారుచేయాలని.. వయసు ఆధారంగా చేసిన జాబితాని వెంటనే రద్దుచేసి.. కొత్తగా తయారుచేయాలని డిస్కంలని ఆదేశించింది. అయినా, కూటమి ప్రభుత్వం న్యాయస్థానం తీర్పుని పెడచెవిన పెట్టింది. 10 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదు. పలుమార్లు అధికారులకు, ప్రభుత్వ ప్రతినిధులకు లైన్‌మెన్‌లు వినతులు సమర్పించినా.. సీనియారిటీ లిస్టుని మార్చడంలేదు. ఇటీవల ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌లో ప్రక్రియ ప్రారంభించారు. అయితే.. ఈపీడీసీఎల్ అధికారులు మాత్రం.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే, 2007లో జూనియర్ లైన్‌మెన్‌లుగా ఎంపికైన 138 మందికి ఉద్యోగాలు ఇవ్వకుండా ఈపీడీసీఎల్ అధికారులు అడ్డుపుల్ల వేశారు. దీనిపై వారు కోర్టుకు వెళ్లగా.. 138 మందికి ఉద్యోగాలివ్వాలని 2011లో న్యాయస్థానం ఆదేశించింది. వీరు విధుల్లో చేరినా సీనియారిటీని కోల్పోయారు. ఇలా.. ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్‌లో 118 మంది, విజయనగరం సర్కిల్‌లో 136, విశాఖపట్నంలో 198, రాజమండ్రిలో 549, ఏలూరులో 353 మంది కలిపి మొత్తం 1,354 జూనియర్ లైన్‌మెన్‌లు పదోన్నతులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్టు తీర్పుని తక్షణమే అమలుచేస్తే.. ఈపీడీసీఎల్ సహా మూడు డిస్కంల పరిధిలో సుమారు 3,500 మంది ఉద్యోగులకు పదోన్నతులు దక్కుతాయి.

సమావేశమే జరగకుండా

తీర్మానమా?

తారాస్థాయికి.. కూటమి కుయుక్తులు

- మేయర్ మార్పు కోసం నిబంధనలకు పాతర
- అజెండా అంశాన్ని.. తీర్మానంగా పేర్కొంటూ కలెక్టర్ నోటీస్
- 58 మంది కార్పొరేటర్లు అవిశ్వాసాన్ని ప్రతిపాదించినట్లు వెల్లడి
- అజెండాలో చర్చించకుండానే.. ప్రతిపాదన ఎలా సాధ్యమంటున్న సభ్యులు
- కలెక్టర్ నోటీసుపై సర్వత్రా అనుమానాలు



గత నెల 31వ తేదీన కలెక్టర్ జారీ చేసిన నోటీసు

ఎంవీపీకాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమి ప్రభుత్వం కుయుక్తులు తారాస్థాయికి చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ మేయర్ మార్పు అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. నిజానికి గ్రేటర్ విశాఖలో కూటమి ప్రభుత్వానికి మేయర్‌ను మార్పు చేసేంతగా బలం లేదు. అయినప్పటికీ ఫిరాయింపులకు తెరతీయడం ద్వారా నగర మేయర్‌ను మార్పు చేయాలని గత కొంతకాలంగా కూటమి ప్రయత్నాలు చేస్తోంది. సాంకేతికంగా మార్పు సాధ్యం కానప్పటికీ దొడ్డిదారిలో కథ నడిపించేందుకు కూటమి నాయకుల సారథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు పావులు కదుపుతున్నారు. తాజాగా 58 మంది కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారంటూ కలెక్టర్ నోటీసులు జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అసలు సమావేశమే జరగకుండా జిల్లా కలెక్టర్/జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ అవిశ్వాస తీర్మాన నోటీసు ఎలా జారీ చేస్తారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తీర్మానం కాపీ

తీర్మానంపై సర్వత్రా అనుమానాలు

మేయర్ మార్పు అంశంపై కూటమి నాయకుల సారథ్యంలో ఉన్నతాధికారులు చేస్తున్న నిర్ణయాలపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ మార్పు అంశంపై ఇప్పటి వరకు కౌన్సిల్‌లో ఎలాంటి చర్చ జరగలేదు. ఈ నెల 19న కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉండగా..నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని అజెండాలో మాత్రమే చేర్చాల్సి వుంది. అనంతరం 19న దీనిపై చర్చ జరిపి కార్పొరేటర్ల ప్రతిపాదనలు మేరకు అవిశ్వాసంపై తీర్మానం పెట్టే వీలుంటుంది. అయితే ప్రస్తుతం అజెండా అంశంగా ఉన్న మేయర్ మార్పుపై తీర్మానం జరిగినట్లు కలెక్టర్/ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ నోటీసు విడుదల చేయడం కూటమి అడ్డగోలు వ్యవహారానికి అద్దం పడుతోంది. పైగా తీర్మానాన్ని 58 మంది కార్పొరేటర్లు ప్రతిపాదించినట్లు కలెక్టర్ ఆ నోట్‌లో వెల్లడించడంపై అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. తీర్మానంపై 58 మంది సభ్యులు సంతకం చేసిన ప్రతిని కౌన్సిల్ సభ్యులందరికీ పంపించినట్లు కూడా కలెక్టర్ తన నోటీసులో పేర్కొన్నారు. అయితే అలాంటి ప్రతులు శుక్రవారం అర్ధరాత్రి వరకు తమకు ఏమీ అందలేదని పలువురు కౌన్సిల్ సభ్యులు వెల్లడించారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల తీరుతో పాటు కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ఈ అడ్డగోలు వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సైనికుల వైద్య సేవలకు యూఎస్-భారత్ ఎంవోయూ



ఇరుదేశాల నౌకాదళ ప్రతినిధులు



సైనిక సహకారంపై చర్చిస్తున్న భారత్, యూఎస్ యుద్ధ నౌకల అధికారులు, సిబ్బంది

కొనసాగుతున్న టైగర్ ట్రయాంఫ్–25 విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం (ఈఎన్‌సీ) విశాఖపట్నంలో భారత్, యూఎస్ దేశాల మధ్య ప్రారంభమైన టైగర్ ట్రయాంఫ్ విన్యాసాలు కొనసాగుతున్నాయి. తొలి దశలో హార్బర్ ఫేజ్‌లో భాగంగా.. ఇరు దేశాల త్రివిధ దళాల ప్రతినిధుల మధ్య సమీక్షలు, చర్చలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మారీటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో రెండు రోజుల పాటు ఇండియన్ నేవీ, యూఎస్ నేవీ వైద్య బృందాల మధ్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సెయిలర్స్, సోల్జర్స్ ఆరోగ్య సంరక్షణ, ఆపరేషనల్ మెడిసన్, వైద్య సంసిద్ధతలో ఉత్తమ సేవలు తదితర అంశాలపై పరస్పర సహకారం అందించుకునేందుకు ఇరు దేశాల మధ్య సబ్జెక్ట్ మ్యాటర్ ఎక్స్‌పర్ట్ ఎక్స్ఛేంజ్(ఎస్ఎంఈఈ) ఒప్పందం జరిగింది. యుద్ధ సమయంలోనూ, విపత్తుల సమయంలోనూ వైద్య సంరక్షణ, ఏరో మెడికల్, క్యాజువాలిటీ మేనేజ్‌మెంట్ మొదలైన విభాగాలపై దృష్టి సారించినట్లు భారత్, యూఎస్ నౌకాదళ ప్రతినిధులు స్పష్టం చేశారు. మరోవైపు.. యుద్ధ నౌకల్లో సహాయ సహకారాలపైనా ఎస్ఎంఈఈ ఇరుదేశాల మధ్య జరిగింది.

మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించాలి

కేంద్ర మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

బీచ్‌రోడ్డు: మానవజాతిని నిర్మించి, నడిపే మహిళలకు సంపూర్ణ భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని కేంద్ర మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యురాలు ఎస్. విజయభారతి అన్నారు. సిరిపురంలోని ఒక హోటల్లో నిర్వహించిన 'స్త్రీ అధికార్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గృహహింస బాధిత మహిళలకు బాసటగా నిలిచే 'స్త్రీ అధికార్' కేంద్రాన్ని కేంద్ర మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయభారతి మాట్లాడుతూ, మహిళలకు భద్రత కల్పించే విధంగా ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. భారత దేశంలో మహిళలకు ఎంతో గౌరవం, ప్రముఖ స్థానం కల్పించే సంస్కృతి ఉందని, నేటి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉండడం విచారకరమని అన్నారు. కుటుంబ వ్యవస్థ బలోపేతం కావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. నిత్యం తమకు 500కు పైగా ఫిర్యాదులు వస్తాయని, వీటిలో 100 వరకు మహిళలకు సంబంధించినవే ఉంటాయని తెలిపారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది మానవ అక్రమ రవాణాకు బాధితులుగా మారడం విచారకరమని చెప్పారు. తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఉండడం ఎంతో అవసరమని సూచించారు. ఉత్తర భారతంలో తాను చూసిన అనేక కేసులు తన మనసును కలచివేస్తున్నాయని వివరించారు. ప్రతి వ్యక్తి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆమె కోరారు. మహిళలకు అవసరమైన హక్కులను, భద్రతను రాజ్యాంగం కల్పించిందని వివరించారు. చట్టాలు మరియు వాటిని నిర్వహించే వ్యవస్థలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న విజయభారతి

బాధితులకు కుటుంబ సహకారం కరువు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, విభిన్న సంఘటనల నేపథ్యంలో బాధితులుగా మారిన మహిళలు తమ వద్దకు వస్తుంటారని, వారి సమస్యలు ఎంతో సున్నితమైనవని పలు ఉదాహరణలతో వివరించారు. వేధింపులు ఎదుర్కొంటున్న వారికి కుటుంబం నుంచి కూడా సహకారం కరువైందని చెప్పారు. కేవలం భర్త నుంచే కాకుండా తమ పిల్లల నుంచి కూడా మహిళలు వేధింపులు ఎదుర్కొంటున్న సంఘటనలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇటువంటి వారికి ఆశ్రయం కల్పించే విధంగా 'స్త్రీ అధికార్' కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనను, నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ పి.సి. దొరస్వామి, స్త్రీ అధికార్ కేంద్రం నిర్వాహకురాలు, సామాజిక కార్యకర్త అనిత సకురు, హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సూర్య నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ ఫైనల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి సంబంధించిన అభ్యర్థుల ఫైనల్ జాబితాను శుక్రవారం రాత్రి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి విడుదల చేశారు. ఈ జాబితాను https@//cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ ఫైనల్ జాబితాపై కూడా అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను రేసపువానిపాలెంలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో అందజేయాలని ఆర్డీ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిశీలించిన తర్వాత ఎంపిక జాబితాను విడుదల చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి జనవరి 27న ప్రాథమిక (ప్రొవిజనల్) జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ జాబితాపై మూడు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించారు.



అయితే, ఇంతలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి అమలులోకి రావడంతో జాబితా పరిశీలన కార్యక్రమం నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ జాబితాల పరిశీలన ప్రారంభించారు.

దరఖాస్తుల వివరాలు: మొత్తం 6 జిల్లాల్లోని 106 స్టాఫ్ నర్సు పోస్టుల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయంలోని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. ఆ తరువాత పోస్టులు మరో 264 పెరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్ , ఆఫ్‌లైన్‌లో కలిపి మొత్తం 8300 దరఖాస్తులు వచ్చాయి. ప్రాథమిక జాబితాపై అభ్యంతరాలు తెలుపుతూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి 1,570 దరఖాస్తులు చేరుకున్నాయి.

దళారులను నమ్మవద్దు

పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుంది. దళారులను ఎవరూ నమ్మవద్దు. అర్హత ప్రమాణాలు, మెరిట్ , రోస్టర్ ప్రకారం ఫైనల్ జాబితా రూపొందించాం. అభ్యర్థులు ఎవరితోనూ సిఫార్సు చేయించవద్దు.

– డాక్టర్ పి. రాధారాణి, ఆర్డీ

భవిత మీదే..



భవిత కేంద్రాల చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ 8లో

7 నుంచి అప్పన్న వార్షిక కల్యాణోత్సవాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం వైదిక, అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7న రాత్రి 7 గంటల నుంచి రుత్విక్ వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహించనున్నారు. 8న మధ్యాహ్నం 3గంటల నుంచి కొట్నాల ఉత్సవం, ధ్వజారోహణం, సాయత్రం 6.30 గంటల నుంచి ఎదురు సన్నాహోత్సవం, రాత్రి 8.15 గంటల నుంచి రథోత్సవం, రాత్రి 10.30 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి శేషవాహనంపై తిరువీధి, రాత్రి 7 నుంచి విశేష హోమాలు నిర్వహిస్తారు. 10న ఉదయం 7.30 నుంచి వైదిక సదస్యం, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పండిత సదస్యం, సాయంత్రం 6 నుంచి సర్వజన మనోరంజని వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. 11న సాయత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధి జరగనుంది. 12న ఉదయం 6.30 గంటల నుంచి పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి 7 గంటల నుంచి మృగయోత్సవం (దొంగలదోపు ఉత్సవం) నిర్వహిస్తారు. 13న ఉదయం 8 గంటల నుంచి వినోదోత్సవం, సాయంత్రం 6 నుంచి శ్రీ పుష్పయాగం, ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.

ఆర్జిత సేవలు రద్దు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని దర్శనాల సమయాల్లో మార్పు చేశారు. ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే దర్శనాలు ప్రత్యేక హోమాల నిర్వహణ వల్ల ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉదయం 7.30 గంటల నుంచి మొదలవుతాయి. ఈ నెల 7వతేదీ నుంచి 14వ తేదీ వరకు (8, 13వ తేదీల్లో మినహా) రాత్రి 7 గంటల తర్వాత స్వామివారి దర్శనాలు లభించవు. 8వ తేదీ వార్షిక కల్యాణోత్సవం రోజు రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. ఈ నెల 10న ఉదయం పండిత సదస్యం కారణంగా ఉదయం 8 గంటలకు దర్శనాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 13న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 గంటల తర్వాత దర్శనాలు లభించవు. అలాగే 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన సేవ, సాయంత్రం ఆరాధనసేవ టిక్కెట్లు రద్దు చేశారు. అలాగే ఈ నెల 7వ నుంచి 24 వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు.

‘తిరుమల’ అవగాహన సదస్సుకు స్పందన



మాట్లాడుతున్న విద్యాసంస్థల ప్రతినిధి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలసలోని తిరుమల విద్యాసంస్థ శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించింది. 5 నుంచి 10వ తరగతి వరకు పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సుమారు 12 వేల మంది హాజరయ్యారు. సదస్సులో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు జాతీయ స్థాయి పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఇచ్చే ఆస్తి విద్య మాత్రమేనని, దీనిపై తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇప్పటి పోటీ ప్రపంచంలో జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్‌కు 25 మంది హాజరైతే ఒక్కరికే సీటు వస్తుందన్నారు. అదే తమ విద్యాసంస్థలలో ప్రతి నలుగురిలో ఒకరికి సీటు లభిస్తుందన్నారు. నీట్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా ప్రతి 16 మందిలో ఒకరికి సీటు లభిస్తే తమ విద్యార్థులలో ప్రతి ముగ్గురిలో ఒకరికి సీటు లభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా తాము తిరుమల ద్వారా సాధించిన ప్రగతిని, తమ అనుభవాలను పంచుకున్నారు. సదస్సులో అకడమిక్ డైరెక్టర్లు కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, ఇ.మృత్యుంజయరావు, జి.సతీష్‌బాబు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏపీఈఏపీసెట్–2025 (ప్రవేశ పరీక్షకు), డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈ మేరకు జిల్లా డిప్యూటీ కలెక్టర్ ఎం.సత్యపద్మ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఫర్ సెంటర్ మైనారిటీస్ సహకారంతో ముస్లిం, క్రిస్టియన్ (బీసీ–సీ), సిక్కులు, బౌద్ధులు,జైనులు, పార్శీలకు చెందిన అభ్యర్థులకు ఈ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఏపీఈఏపీసెట్–2025, డీఎస్సీ దరఖాస్తు కాపీలతోఈ నెల 6వ తేదీ లోపు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సిరిపురంలోని హైట్స్ అపార్ట్‌మెంట్‌లో (హెచ్ఎస్‌బీసీ కాల్ సెంటర్ మెయిన్‌గేట్ ఎదురుగా) దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 79931 85662 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చిరువ్యాపారులపై కూటమి కక్ష


జ్యూస్ కౌంటర్లను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- వీధి వ్యాపారుల పొట్టకొడుతున్న ప్రభుత్వం
- పూర్ణామార్కెట్ ప్రాంతంలో షాపుల తొలగింపు
- హైకోర్టు స్టేటస్ కో ఇచ్చినా అధికారుల దుశ్చర్య
- కూటమి పెద్దలను సంతృప్తి పర్చడానికి బరితెగింపు
- వైఎస్సార్‌సీపీకి అభిమానులన్న కక్షతోనే చర్యలు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం బడుగుల పొట్ట కొడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా.. పేదల జీవనోపాధిని సైతం దూరం చేస్తోంది. కక్షపూరిత రాజకీయాలు చేస్తూ.. వీధి వ్యాపారులపై అధికార దందాను ప్రదర్శిస్తోంది. వైఎస్సార్‌సీపీ అభిమానులన్న అనుమానంతో బలవంతంగా వారి షాపులు, బడ్డీల తొలగింపునకు పూనుకుంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు చిరు వర్తకులపై చేపడుతున్న ఈ దుశ్చర్యపై హైకోర్టు స్టేటస్ కో ఇచ్చినప్పటికీ, అధికారులు వెనక్కు తగ్గడం లేదు. హైకోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ ప్రభుత్వ పెద్దల అడుగులకు మడుగులొత్తుతూ పూర్ణామార్కెట్ జంక్షన్ బౌదరా రోడ్డులోని వీధి వ్యాపారులపై శుక్రవారం విరుచుకుపడ్డారు.

అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు బేఖాతరు

హైకోర్టు స్టేటస్ కో ఇచ్చినప్పటికీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. శుక్రవారం ఉదయం పోలీస్ సిబ్బందితో జీవీఎంసీ అధికారులు దిగబడ్డారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేనప్పటికీ.. జ్యూస్ కౌంటర్, స్వీట్ బండి, ఇతర స్టాళ్లను తొలగించి, ధ్వంసం చేశారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ జీవీఎంసీ, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు వివాదాస్పదమవుతోంది. కూటమి పెద్దలను సంతృప్తి పర్చడం కోసం జీవీఎంసీ అధికారులు, పోలీసులు ఇలా సాగిల పడుతుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల తీరుపై కోర్టు ధిక్కార కేసు వేయాలని వ్యాపారులు భావిస్తున్నారు.

హైకోర్టు స్టేటస్ కో ఇచ్చినా..

బౌదరా రోడ్డులోని ఒక భవనానికి ఆనుకుని ఉన్న మంచినీళ్ల ట్యాంక్, జ్యూస్ కౌంటర్, స్వీట్ బండి ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్నాయని గతంలో జీవీఎంసీ అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. వాస్తవానికి వీరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులన్న అనుమానంతో కక్ష సాధింపు చర్యలకు దిగారు. జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేసి వీరిని అక్కడి నుంచి తొలగించేందుకు గతంలో ప్రయత్నించారు. ఈ సమయంలో ఆ వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ నేత కొండా రాజీవ్ అండగా నిలిచారు. వారితో పాటు రాజీవ్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఎటువంటి తొందర పాటు చర్యలు తీసుకోవద్దని, యథాస్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ నేతకు బెయిల్


జలదుర్గం పోలీస్ స్టేషన్ నుంచి వస్తున్న కర్రి శ్రీనివాసరావు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ నేత, బీసీ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు కండిషన్ బెయిల్‌పై విడుదలయ్యారు. శ్రీనివాసరావును నంద్యాల జిల్లా, జలదుర్గం పోలీసులు ఈ నెల 2న అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ వారంలో మూడు రోజులు పోలీసుల ఎదుట హాజరు కావాలని, 60 రోజులపాటు నంద్యాల దాటి వెళ్లవద్దంటూ శ్రీనివాసరావుకు కండిషన్ బెయిల్ మంజూరు చేశారు. జలదుర్గం పోలీసు స్టేషన్ నుంచి శ్రీనివాసరావు సాక్షితో మాట్లాడుతూ రాజకీయ కక్షలతో తన ఆస్తులను ధ్వంసం చేస్తున్న సమయంలో ఆవేశంతో మాట్లాడితే స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంతోపాటు రాష్ట్రంలో పలు చోట్ల కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా తనకు పార్టీ అండగా నిలిచిందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సారథ్యంలోనే పని చేస్తానన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన స్థాయికి తగిన వారితో రాజకీయాలు చేస్తే బాగుంటుందన్నారు. సామాన్య నాయకుడైన తనపై కేసులు పెట్టించి వేధించటం స్పీకర్‌కు భావ్యం కాదని ఆవేదన వెలిబుచ్చారు.

పర్యాటకంగా మధ్యప్రదేశ్‌కు ఆదరణ


మాట్లాడుతున్న వివేక్ జూడే

బీచ్‌రోడ్డు: మధ్యప్రదేశ్ పర్యాటక ప్రాంతాలు దక్షిణాది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని ఆ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ వివేక్ జూడే అన్నారు. తమ రాష్ట్ర పర్యాటక ప్రచారంలో భాగంగా శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ప్రాంతం 30% అటవీ విస్తీర్ణం, 12 జాతీయ ఉద్యానవనాలు, 9 టైగర్ రిజర్వులతో పాటు వన్యప్రాణుల గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకుల కోసం 14 ప్రత్యేక తీర్థయాత్ర స్థలాలున్నాయన్నారు. గడచిన ఐదేళ్లలో తమ రాష్ట్రానికి 12.6% సందర్శకుల తాకిడి పెరిగిందన్నారు. నగరానికి చెందిన పలువురు ట్రావెల్ ఏజెంట్లు, టూరిజం ఆపరేటర్లు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మధ్యప్రదేశ్ టూరిజం విశేషాలపై రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. మధ్యప్రదేశ్ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ మునిష్ కౌశల్, రెసిడెంట్ మేనేజర్ వినోద్ జాట్ పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో చిన్నారులకు బంగారు భవిష్యత్తు

- ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఉపకరణాల పంపిణీలో కలెక్టర్
- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 160 మంది చిన్నారులకు వివిధ పరికరాల పంపిణీ


సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్


సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

మహారాణిపేట: అన్నిరకాల వసతులతో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని, సాధారణ పిల్లలకు దీటుగా ఎదిగేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై చిన్నారులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. వారితో ముచ్చటించారు. వారు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి చప్పట్లతో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని 11 భవిత కేంద్రాల ద్వారా ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో 2,474 మంది చిన్నారులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతరులు ఏమనుకుంటారో అనే సంశయాన్ని విడనాడి ప్రత్యేక అవసరాలు గల పిల్లల్ని సమీపంలో ఉన్న భవిత కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆలిమ్‌కో సంస్థ సహకారంతో ఈ విడతలో రూ.96.85 లక్షల వ్యయంతో సమకూర్చిన 106 రకాల పరికరాలను 160 మందికి అందజేస్తున్నామని, మలి విడతలో మిగిలిన వారికి అందించనున్నట్లు పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ సహిత విద్యను ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 58 ట్యాబులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కణితి జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న పి.అమన్ అనే విద్యార్థి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో రాణించాడని, చంద్రంపాలెం పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీలో సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా ట్రైసైకిళ్లు, బ్యాటరీ వాహనాలు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, రోలేటర్లు, వీల్ చైర్లు అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ గీత, ఏపీఎం, సీఎంవో, ఇతర అధికారులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వేసవి వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా షాలిమర్–చెన్నై –షాలిమర్ మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్–చెన్నై (02841)సమ్మర్‌స్పెషల్ ప్రతీ సోమవారాల్లో ఈ నెల 7,14,21వ తేదీలలో సాయంత్రం 6.30గంటలరే షాలిమర్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.08గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.10గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.30గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో చెన్నై సెంట్రల్–షాలిమర్(02842) సమ్మర్ స్పెషల్‌ప్రతీ బుధవారాలలో ఈనెల 9,16,23వ తేదీలలో తెల్లవారు 4.30గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.30గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 7.32గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.20గంటలకు షాలిమర్ చేరుకుంటాయి.

రైళ్ల గమ్యస్థానాల కుదింపు

వాల్తేరు డివిజన్, కేకే లైన్, జగదల్‌పూర్–కిరండూల్ సెక్షన్ , బచేలి–కిరండూల్ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న రెండో లైన్ నిర్మాణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే కొన్ని రైళ్ల గమ్యస్థానాలను తాత్కాలికంగా కుదిస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ తెలిపారు. ఈనెల 14వ తేదీ వరకు విశాఖ నుంచి బయలుదేరే ఈ రైలు దంతెవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో శనివారం నుంచి 15వ తేదీ వరకు కిరండూల్‌లో బయలుదేరవలసిన కిరండూల్–విశాఖ పాసింజర్ (58502) కిరండూల్ నుంచి కాకుండా దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515)ఈ నెల 14వ తేదీ వరకు విశాఖ నుంచి బయలుదేరే ఈ రైలు దంతెవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో శనివారం నుంచి 15వ తేదీ వరకు కిరండూల్‌లో బయలుదేరవలసిన కిరండూల్–విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) కిరండూల్ నుంచి కాకుండా దంతెవాడ నుండి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.

హత్యాయత్నంపైనా పోలీసుల నో యాక్షన్


కత్తితో దాడికి ప్రయత్నిస్తున్న దుంపరెడ్డి (ఇన్‌సెట్ గాయాన్ని చూపుతున్న సంధ్య)

- పైగా స్థానిక నాయకులతో రాజీకి ప్రయత్నం
- ఐదు రోజులైనా నమోదుకాని ఎఫ్ఐఆర్
- మీడియాను ఆశ్రయించిన బాధితురాలు

కొమ్మాది: తనపై, తన కుమార్తెపై కత్తితో దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఒక మహిళ భయంతో మీడియాను ఆశ్రయించిన ఘటన ఇది. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పరదేశిపాలెంలో సంధ్య అనే మహిళ తన కుమార్తెతో నివసిస్తోంది. ఇటీవల అదే ప్రాంతానికి చెందిన దుంప రెడ్డి అనే వ్యక్తి ఆమె ఇంటి ఎదురుగా ఉన్న 64 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, దీనిని అడ్డుకున్నారు. అయితే అధికారులకు సమాచారం ఇచ్చింది తానే అన్న అనుమానంతో మార్చి 31న దుంప రెడ్డి కత్తితో తనపై దాడికి దిగినట్లు సంధ్య పేర్కొంది. అడ్డుకున్న కుమార్తెపై కూడా నిందితుడు దాడిచేసినట్లు తెలిపింది. ఈ ఘటనపై వెంటనే భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. తమపై హత్యాయత్నం సమయంలో గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారి రాకను గమనించి, నిందితుడు పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు చేసి ఐదు రోజులైనా తనకు న్యాయం జరగలేదంటూ శుక్రవారం తన ఇంటి వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక నాయకులు దుంపరెడ్డికి అండగా నిలిచారని, పోలీసులు కూడా వారికే సహకరిస్తున్నారని ఆరోపించింది. దీన్ని రాజకీయం చేసి కేసు రాజీ చేసేందుకు తనపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపింది. ఇప్పటికైనా తనకు న్యాయం జరగకపోతే సీపీని ఆశ్రయిస్తానని వివరించింది. దీనిపై భీమిలి సీఐ తిరుమలరావును వివరణ కోరగా ప్రస్తుతం కొమ్మాదిలో ఒక మర్డర్ కేసు విచారణలో ఉండటంతో, ఈ కేసు నమోదులో జాప్యం జరిగిందన్నారు. దాడికి యత్నించిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఆర్థిక, ఆరోగ్య ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


ఎంవీపీ కాలనీ: ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యల కారణంగా స్థానిక లాసన్స్ బే కాలనీలో ఎన్‌డీ మిల్టన్(64) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు.. మిల్టన్ జిల్లా సహకార శాఖ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసి పదవీవిరమణ పొందారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నిరాశకు గురై శుక్రవారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకున్నారు. కుటుంబ సభ్యుడు రెజీనాల్డ్ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


ఎనిమిది నెలల చిన్నారికి గ్లకోమా శస్త్ర చికిత్స


శిశువుతో తల్లిదండ్రులు

సింహాచలం: ఎనిమిది నెలల గిరిజన శిశువుకు గ్లకోమా శస్త్ర చికిత్స విజయవంతం అయింది. విశాఖపట్నం నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి చూపు ప్రసాదించి అద్భుత మైలురాయిని అధిగమించిందని ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని బట్టివలస గ్రామంలో ఈ ఏడాది మార్చి 28న శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. ఆ గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ దంపతులు తమ ఎనిమిది నెలల చిన్నారికి నిరంతరం కుడి కంట్లో నీరు కారుతోందని వైద్య శిబిరానికి తీసుకొచ్చారు. అక్కడ చిన్నారిని పరీక్షించిన డాక్టర్ సమృద్ధి దేశ్‌ముఖ్ ప్రత్యేక చికిత్స కోసం శంకర్ ఫౌండేషన్ ప్రధాన ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో తల్లిదండ్రులు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. గ్లకోమా విభాగం డైరెక్టర్, హెచ్‌వోడీ డాక్టర్ టి.రవీంద్ర బృందం చిన్నారిని పరీక్షించింది. గ్లకోమాని నివారించడానికి, దృష్టి మరింత క్షీణించకుండా నిరోధించేందుకు శస్త్రచికిత్స చేయాలని నిర్ధారించారు. దాంతో మార్చి 29న శిశువుకు ట్రాబెక్యులోటోమీ శస్త్రచికిత్స చేశారు. శిశువుకు పూర్తిగా దృష్టిని పునరుద్ధరించారు. సంక్లిష్టమైన చికిత్సను విజయవంతంగా పూర్తిచేసి శిశువు జీవితంలో కొత్త కాంతిని తీసుకొచ్చిన డాక్టర్ రవీంద్ర అండ్ బృందాన్ని ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జీఎం కె.రాధాకృష్ణన్ అభినందించారు. సర్జరీ విజయవంతం కావడంతో వైద్య బృందానికి రంజిత్‌కుమార్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థుల సృజనతో అద్భుతాలు ఆవిష్కృతం


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ చంద్రశేఖరరావు


ప్రథమ స్థానంలో నిలిచిన గాజువాక పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: పాఠశాలల్లో విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచిస్తే అద్భుతాలు చేయొచ్చని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ జె.చంద్రశేఖరరావు తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ సంయుక్తంగా వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమాన్ని తోటగరువు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 11 హైస్కూళ్ల నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తాము రూపొందించిన వివిధ ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌తో పాటు ఏఎంవో లక్ష్మి పాల్గొని పిల్లలు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపికచేసి విద్యార్థులకు బహుమతులు అందించారు. గాజువాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన ‘బెనిఫిట్స్ ఆఫ్ ఎగ్ షెల్స్’ప్రథమ బహుమతి, సరిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ‘యాన్ ఇన్నోవేషన్ ఇన్ డ్రైనేజ్ క్లీనింగ్’ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ విద్యార్థుల మనస్తత్వ అభివృద్ధి, వారి ఎదుగుదలకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాల ఆధారంగా, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు తయారు చేయడంలో ఉపాధ్యాయుల సహకారం ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నరు. కార్యక్రమంలో తోటగరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.భవాని, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్ హ్యాకథాన్‌లో మాధవధార విద్యార్థుల ప్రతిభ


అందుకున్న బహుమతులతో విద్యార్థులు, సిబ్బంది

మురళీనగర్: సమగ్ర శిక్ష, అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్, ఎల్ఎఫ్ఈ సంయుక్తంగా నిర్వహించిన టెక్నాలజీ చాలెంజ్‌లో మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీఎస్ హ్యాకథాన్ 2025 పేరుతో కంప్యూటర్ కోడింగ్ పోటీలో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని సాధించారు. హెచ్ఎం బి.హేమలత పర్యవేక్షణలో పాఠశాల ఉపాధ్యాయుడు వీవీ జానకీరామ్, విద్యార్థులు విద్య, చైతన్య, సంజయ్ రూపొందించిన కోడింగ్‌కు బహుమతి లభించింది. ఇంట్లో తండ్రులు మద్యపానానికి బానిసలవడం వల్ల పిల్లల చదువులపై ప్రభావం, దీని నివారణకు ప్రభుత్వం, సమాజం, పాఠశాల నిర్వహించాల్సిన బాధ్యతలు తదితర అంశాలతో యానిమేషన్ స్టోరీని రూపొందించి, టెక్నాలజీ నిపుణుల ప్రశంసలు పొందారు. వీరికి ధ్రువపత్రాలతోపాటు పాఠశాలకు ఒక టీవీ, 3 ల్యాప్‌టాప్‌లు, రెండు ట్యాబ్‌లు, ఒక గూగుల్ అలెక్సా బహుమతులుగా ప్రభుత్వం అందించింది.